కథా కౌముది

# చుక్క నీటి కోసం

కృపాకర్ పోతుల



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
బహుమతి పొందిన కథ

ఎక్కడో పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం నుండి రాయలసీమలో అనంతపురానికి బదిలీ మీద వచ్చిన శైలేంద్రకి కశ్మీర్ నుండి థార్ ఎడారిలోకి వచ్చిపడినట్టుంది. చల్లని తల్లిలా, నిండుగా ప్రవహించే 'వశిష్టగోదావరి' ఒకవేపూ, చిన్నపిల్లల అల్లరిలా గలగలా సవ్వడి చేస్తూ పారే పంటకాలువలు ఇంకొకవేపూ, కంటికీ మనసుకీ ఆహ్లాదాన్నిచ్చే పచ్చటి పైర్లూ, వాటిపైనుండి వీచే చల్లనిగాలిలో మహారాజుల్లా హుందాగా తలలెత్తుకు నిలబడ్డ కొబ్బరిచెట్లు మరొకవేపూ ....భూతలస్వర్గంలాంటి గోదావరిసీమ నుండి, రాళ్ళూ రప్పలూ నాగజెముడు డొంకలూ తప్ప, చుక్కనీరుగాని పచ్చనిపైరు గాని కనిపించని రతనాలసీమకి వచ్చిపడ్డాక 'ప్రోమోషన్ తీసుకొని తప్పుచేసానేమో" అని శైలేంద్ర పశ్చాత్తాపపడిన సందర్భాలు కోకొల్లలు.

గోదావరిజిల్లా ఆప్యాయతల్నీ, మర్యాదా మన్ననల్నీ, అప్పుడప్పుడూ "ఎటకారాల్నీ" కూడా చవిచూసి, ఆస్వాదించిన శైలేంద్రకి రాయలసీమ ప్రజల పరుషమైన మాటతీరూ, మొరటు ప్రవర్తనా ఆశ్చర్యాన్ని మాత్రమేకాక ఒకింత భయాన్నీ, కోపాన్నీ కూడా కలిగించేయి అక్కడకు వెళ్ళిన కొత్తలో.

"ప్రమోషన్ మీద గాబట్టి ఇష్టం ఉన్నా లేకపోయినా రాక తప్పలేదు. వచ్చాక కనీసం రెండేళ్ళైనా ఉండక తప్పదు. ఎలాగోలా కష్టపడి రెండేళ్ళూ పూర్తి చేసేస్తే, మనవేపుకి వెళ్ళిపోవచ్చు. మళ్ళీ ఇటువేపు తిరిగి చూడాల్సిన పనే ఉండదు" అని తనని తనే ఓదార్చుకొని, అక్కడి ప్రజలకీ, పరిస్థితులకీ అలవాటుపడే ప్రయత్నంలో పడ్డాడు.

శైలేంద్ర బదిలీ చేయబడ్డ బేంకుశాఖ వ్యవసాయాభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చెయ్యబడ్డ శాఖ. బ్రాంచికి అనుసంధానించబడిన గ్రామాల్లో (సర్వీస్ ఏరియా) రైతులతో సత్సంబంధాలు ఏర్పరచుకొని, వారి అవసరాల అనుగుణంగా ఋణాలు మంజూరుచేయడం మాత్రమేకాక అవి సద్వినియోగమయ్యేటట్టు చూడడం, తిరిగి వాటిని వసూలు చేయడం కూడా మేనేజరుగా అతని బాధ్యతలే. ఈ బాధ్యతా నిర్వహణలో తరచు సర్వీస్ ఏరియాలోని గ్రామాలను సందర్శించాల్సిన అవసరం ఏర్పడేది.

అలా గ్రామాలకి వెళ్ళినప్పుడు, అక్కడ పొలాలన్నీ చిన్నచిన్న రాళ్లతో నిండి ఉండడం చూసి మొట్టమొదట్లో చాలా ఆశ్చర్యపోయాడు శైలేంద్ర. 'ఇక్కడ రైతులకి పనిచేయడానికి ఒళ్ళొంగదులా ఉంది. లేకపోతే ఇన్ని రాళ్ళెందుకుంటాయి పొలాల్లో!!" అనుకున్నాడు మనసులో. అదేమాట అక్కడ రైతుల్ని అడిగాడు, కాస్తంత వేళాకోళం మేళవించి.

"రాయలసీమలో వర్షాలు చాలా తక్కువగా కురుస్తాయి కదు సార్. పొలాల్లో రాళ్ళు ఏరి పారేసామనుకోండి, కురిసిన నాలుగు చినుకులూ ఒకట్రెండు రోజుల్లోనే ఆవిరైపోతాయి. అదే రాళ్ళున్నాయనుకోండి... వాటికింద చేరిన చెమ్మ కనీసం వారంరోజులైనా ఉంటుంది. మొక్కలు వాటిని పీల్చుకొని, చావకుండా బతకడానికి వీలౌతుంది" అని వారిచ్చిన సమాధానం విని ఆశ్చర్యంతో ముక్కున వేలేసుకున్నాడు.

"సర్కారుపోతే సీమ పండుతాది" అనే నానుడి మొట్టమొదటిసారి విన్నప్పుడు 'సర్కారు పోవడమేంటి సీమపండడమేంటి. తమాషాగా ఉందే!' అనుకున్నాడు ఆశ్చర్యంగా. కొన్నాళ్ళు పోయాక అర్థమైంది తుఫానులు రావడం సర్కారుజిల్లాల్లో ఎక్కువ గనుక, వాటి ప్రభావం వల్ల సీమలో కొద్దిపాటి వర్షమైనా కురుస్తుందనీ, కాస్తైనా పంట పండుతుందని దాని భావం అని.

గ్రామాలకి వెళ్ళి అక్కడి పరిస్థితులు నిశితంగా పరిశీలించడం మొదలుపెట్టాకగాని ఆ ప్రాంతం గురించి పూర్తి అవగాహన కలగలేదు శైలేంద్రకి. భయంకరమైన వర్షాభావం వలన వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడం; పర్యవసానంగా కరువు కాటకాలు శాశ్వతంగా తిష్టవేసుక్కూర్చోవడం; ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు మృగ్యం కావడం; వీటిని నివారించే ప్రయత్నాలు నిబద్ధతతో జరగక పోవడం, ఫలితంగా వేళ్ళూనుకున్న పేదరికం...ఇవి మాత్రమేకాక, శతాబ్దాలుగా అక్కడి ప్రజల్ని శాసించిన 'పాళెగాళ్ల' చేతుల్లోనే స్వాతంత్ర్యానంతర రాజకీయవ్యవస్థ కూడా చిక్కుకు పోవడం, ఇవన్నీ సామాన్యప్రజల జీవితాల మీద ఎటువంటి విషతుల్యమైన ప్రభావాన్ని చూపున్నాయో అవగతమయ్యాక, వారిమీద అంతవరకూ పేరుకున్న అసహనం, కోపం తొలగిపోయి వాటి స్థానంలో సానుభూతి చోటు చేసుకుంది.

దానితో 'ఇక్కడుండే కొద్దికాలం బేంకు తనకు అప్పజెప్పిన బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించి రైతులకు తన పరిధిలో, తనకు వీలైనంత సహాయం చేసి తీరాలనే' నిర్ణయానికి వచ్చాడు శైలేంద్ర.

★★★★★

ఆ సంవత్సరం వర్షాలెత్తిపెట్టేసి పంటలు పండకపోవడంతో రైతులంతా ప్రభుత్వం వారిచ్చే పంటబీమా గురించి వెయ్యికళ్ళతో ఎదురుచూస్తున్నారు. బీమా డబ్బు త్వరలోనే రిలీజ్ అవబోతోంది అన్న వార్త గుప్పుమనడంతో ఎక్కడెక్కడి గ్రామాలనుంచీ రైతులు బేంకుకి బారులుతీరి వస్తున్నారు డబ్బులు ఖాతాల్లో ఎప్పుడు జమచేయబడతాయో భోగట్టా చెయ్యడానికి. అలా వచ్చిన వారితో బేంకంతా కోలాహలంగా ఉంది.

అలాంటి సమయంలో శైలేంద్ర కేబిన్ లోకి అడుగుపెట్టాడు ఫీల్డాఫీసర్ స్వామి. అతని వెనకగా ఒక నలభై-యాభైఏళ్ళ రైతుకూడా. మాసిన తలా, మాసిన గడ్డం, మాసిన గుడ్డలూ, రెండురోజులుగా తిండి తిననివాడిలా లోతుకుపోయిన కళ్ళూ, రెండురాత్రులు నిద్రలేని వాడిలా పీక్కుపోయిన మొహం...పేదరికానికి నిలువెత్తు ప్రతిరూపంలా ఉన్నాడతను. అలాంటి స్థితిలో కూడా, శతృవు చేతిలో పరాజయానికిలోనై రాజ్యం కోల్పోయిన రాజుగారిలా హుందాగానే ఉన్నాడు.

“చెప్పండి” అన్నట్టు చూసాడు శైలేంద్ర.

“ఈయన పెద్దిరెడ్డి అని ఈ ఊరే సర్. మన ‘సర్వీస్ ఏరియా’లో ఈయనకి పదెకరాల భూమి ఉంది. దానిలో ఐదెకరాలు చీనీతోట వేసి మిగతా ఐదెకరాల్లోనూ బొప్పాయి వేసేడు. తోట బాగానే పెరిగిందిగాని, సరిగ్గా పంట చేతికొచ్చే సమయానికి వర్షాలు ఎత్తిపెట్టేసి, కాయలు రాలిపోతున్నాయట. ‘బోర్ వెల్’ వేస్తే పంట దక్కొచ్చనీ, లోను శాంక్షన్ చేస్తే బోరు వెయ్యించుకుంటాననీ అంటున్నాడు” అన్నాడు స్వామి.

“ఇప్పటికి మూడు బోర్లు వెయ్యించేడటగాని నీరు మాత్రం పడలేదట” అని ముక్తాయించాడు శైలేంద్ర వేపు అర్ధవంతంగా చూస్తూ.

చేతులు కట్టుకొని నిలబడిఉన్న పెద్దిరెడ్డి వేపు చూసాడు శైలేంద్ర. పదెకరాల భూస్వామి. గోదావరి జిల్లాల్లో అయితే కార్లో వస్తాడు బేంకుకి. సరాసరి బ్రాంచి మేనేజరు గదిలోకే ప్రవేశిస్తాడు. మేనేజరు కాఫీ తెప్పించి మర్యాద చెయ్యకపోతే అలుగుతాడు. అలాంటి కథలు...అబ్బో...చాలానే ఉంటాయక్కడ.

ఇక్కడ...రాయలసీమలో...అదే పదెకరాల భూవసతి ఉన్న రైతు... దరిద్ర దేవత తోడబుట్టినవాడిలా, పరమ దయనీయంగా ఉన్నాడు. “ఎంత తేడా ఒకే రాష్ట్రంలో రెండు ప్రాంతాల మధ్యా. అక్కడ దేనికీ లోటుండదు; ఇక్కడ ప్రతీదానికీ కరువే!!! ఏ దుష్టశక్తి ఎప్పుడుపెట్టిన శాపమో సీమ వారికి” అనుకున్నాడు శైలేంద్ర బాధగా.

“మూడుసార్లు ప్రయత్నించినా నీరుపడలేదంటున్నారు. మళ్ళీ పడకపోతే డబ్బులు దండగ కదా రెడ్డిగారూ. అప్పులో ఇరుక్కుపోతారు కూడా” అన్నాడు పెద్దిరెడ్డితో.

”భూగర్భజలశాఖ వారితో మాత్రమేకాక, వేరే అతనితో కూడా సర్వే చెయ్యించేను సార్. తప్పక పడతాయనే చెప్తున్నారు అందరూ” అన్నాడు పెద్దిరెడ్డి వినయంగా. “చాలా డబ్బులు కర్చుపెట్టి బొప్పాయితోట వేసేను సార్. సరిగ్గా పంట

చేతికొచ్చే టైంకి వర్షాలెత్తేసి, కాయలు, పిందెలతో సహా రాలిపోతున్నాయి. మీరు దయుంచి కాస్త సాయంచేస్తే బోరు వేసుకుంటాను సార్" అన్నాడు ఫీల్డాఫీసరు చెప్పినదే మళ్ళీ చెప్తూ.

"ఒక పనిచేద్దాం స్వామీ. ఒకసారి గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్ వాళ్ళ రిపోర్తూ, వేరే జియాలజిస్ట్ ఇచ్చిన రిపోర్టూ, రెండూ జాగ్రత్తగా పరిశీలించండి. అంతేకాకుండా ఆ జియాలజిస్టుతో ఒకసారి స్వయంగా మాట్లాడండి. రేపొకసారి మనం వెళ్ళి, రెడ్డిగారి తోట చూసొద్దాం. ఏమాత్రం అవకాశం ఉన్నా తప్పక సాయం చేద్దాం" అన్నాడు శైలేంద్ర.

★★★★★

మరసటి రోజు అధికారులిద్దరూ బయల్దేరారు పెద్దిరెడ్డి గ్రామానికి, 'ప్రీ శాంక్షన్ సర్వే' చెయ్యడం కోసం. కనుచూపుమేర ఎటుచూసినా నీరులేక ఎండిపోతున్న చెనిక్కాయ పొలాలూ, చీనీతోటలూ... ఎడారిని తలపిస్తూ, హృదయవిదారకంగా, భయం గొలిపేదిలా ఉంది ప్రకృతి చిత్రం.

"భయమేస్తోంది స్వామీ ఈభీభత్సం చూస్తుంటే. పరిస్థితి ఇంత భయంకరంగా ఉంటే ఇక్కడ రాజకీయనాయకులూ, అక్కడ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు కూర్చోవడం బాధాకరంగా ఉంది. యూ నో ద ఐరనీ. మన రాష్ట్రాన్ని పరిపాలించిన ముఖ్యమంత్రుల్లో ఎక్కువమంది రాయలసీమకు చెందినవారే. అయినా ఈప్రాంతం ఇంత వెనుకబడి ఉందంటే తప్పెవరిదనుకోవాలి. ప్రజల బాగోగులు పట్టని రాజకీయనాయకులదా, లేక అలాంటి వారినే మళ్ళీమళ్ళీ అందలమెక్కిస్తున్న సీమ ప్రజలదా" అన్నాడు శైలేంద్ర ఆవేదనతో.

"మా రాయలసీమ కథే పెద్ద వైరుధ్యాల పుట్ట సర్. మీకు తెలుసో లేదో లక్జరీ కార్ల అమ్మకాల్లో అనంతపురం మన రాష్ట్రంలోనే రెండోస్థానంలోనో, మూడోస్థానంలోనో ఉంటుందట. దీన్ని బట్టే అర్థం చేసుకోవచ్చు ఇక్కడి పరిస్థితి ఏంటో. డబ్బుల్లేకపోవడం కాదుసార్ ఇక్కడ సమస్య. అవి దండిగానే ఉన్నాయి; కాకపోతే కొద్దిమంది చేతుల్లోనే అవన్నీ కేంద్రీకృతమై ఉన్నాయి. దానికి తోడు ఇక్కడి రాజకీయాలు కూడా అటువంటి వారి గుప్పిళ్ళ లోనే చిక్కుకొని ఉన్నాయి. వారికి ప్రజలగోడు పట్టదు సార్. అందుకే ఇక్కడి ప్రజల బ్రతుకులు మార్పేమీ లేకుండా శతాబ్దాలుగా కునారిల్లిపోతూనే ఉన్నాయి. ఇవన్నీ చిన్నప్పట్నుండీ చూస్తూ పెరిగిన వాళ్ళం సర్. అలవాటైపోయింది మాకు." అన్నాడు స్వామి చిన్నగా నవ్వుతూ.

ఇంతలో వారు ప్రయాణిస్తున్న జీపు పెద్దిరెడ్డి తోట దగ్గరకు చేరుకుంది. పెద్దిరెడ్డి అక్కడే ఉన్నాడు వీరి కోసం ఎదురుచూస్తూ. తోటలో ప్రవేశించారు ముగ్గురూ. చెట్లన్నీ చుక్కనీరు లేక నీరసంగా తలలు వేలాడేసి ఉన్నాయి. ప్రతీ చెట్టుకిందా రాలిపోయిన బొప్పాయికాయలు, చీనీ కాయలూ చెల్లాచెదురుగా పడిఉన్నాయి. చెట్లకి ఉన్నవి కూడా ఎండకు ఎండిపోతూ, రేపో మాపో రాలిపోవడాని సిద్దంగా ఉన్నాయి. వాటిని చూస్తున్న శైలేంద్రకి బాధతో కళ్ళు చెమర్చినంత పనయ్యింది. "నాకే ఇంత బాధగా ఉంటే పాపం పెద్దిరెడ్డికి ఇంకెంత బాధగా ఉంటుందో" అనుకున్నాడు మనసులో.

ముగ్గురూ తోటంతా కలయదిరిగి, ఒకదగ్గరకు రాగానే “ఇక్కడే సార్ బోరు వేసేది” అన్నాడు పెద్దిరెడ్డి చేత్తో చూపిస్తూ.

“ఎక్కడ వేసినా నీరు పడాలిగా రెడ్డిగారూ. జియాలజిస్టులు పడతాయని చెప్తున్నారుగాని నాకెందుకో నమ్మకం కుదరట్లేదండీ. ఒకవేళ నీరు పడకపోతే మిమ్మల్ని మరింత కష్టాల్లోకి నెట్టేసినవాడ్నవుతానేమోనని భయంగా ఉంది” అన్నాడు శైలేంద్ర.

”అంతమాటనకండి సార్ . మీ మీదే ఆశలన్నీ పెట్టుకున్నాను. ఈ ఒక్కసాయం చెయ్యండి. ఇక అప్పు మాటంటారా నిండా మునిగినోడ్ని. నాకు చలేంటి సార్. ఒకవేళ నీరు పడకపోతే, ఈ భూమి అమ్మేసైనా అప్పు తీర్చేస్తానుగాని మీకు మాట రానివ్వను. రాయలసీమోళ్ళం సార్ ప్రాణాలకంటే మాటకి ఎక్కువ విలువిస్తాం మేము“ అన్నాడు పెద్దిరెడ్డి ఆవేశంగా.

”సరే రేపొకసారి బేంకుకొచ్చి కనబడండి. ఆలోచించుకొని ఏ విషయం చెప్తాను” అని చెప్పి తిరుగుప్రయాణం అయిపోయారు అధికారులిద్దరూ.

“ఏం చేద్దాం స్వామీ నాకైతే ఇవ్వాలనే ఉందిగాని, నీరు పడుతుందని నమ్మకం కలగట్లేదు. నీరు పడకపోతే పెద్దిరెడ్డికి సాయపడకపోగా, మరిన్ని కష్టాలపాలు చేసిన వాళ్ళమౌతాం. ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నాను” అన్నాడు శైలేంద్ర సందిగ్ధంగా.

”పెద్దిరెడ్డి గురించి ఎంక్వైరీ చేసాను సార్. మనిషి మంచివాడనీ, కష్టపడే తత్వం ఉన్నవాడనీ చెప్పేరందరూ. అందుకే ఒకపని చేద్దాం సర్. లోను శాంక్షన్ చేద్దాం. నీరు పడిందా...మంచిదే. పెద్దిరెడ్డి బతికిపోతాడు. ఒకవేళ పడలేదనుకోండి. వచ్చే ఏడు ఎలాగూ ఎన్నికలు వస్తున్నాయి. ఏ పార్టీ గెలిచినా, ఎవరు ముఖ్యమంత్రి అయినా అందరికీ బేంకులే కదు సర్ లోకువ. మనమీదే కదా కదా పడేది ఏ రాజకీయపార్టీ అయినా. ఋణమాఫీ అంటారు. అప్పులు మాఫీ చేస్తారు. పెద్దిరెడ్డి లోను కూడా రైటాఫ్ అయిపోతుంది. ఎవరికీ నష్టం ఉండదు.“ సూటిగా చెప్పేడు స్వామి.

స్వామి నిజాయితీ గల ఆఫీసరనీ, రైతులపట్ల సానుభూతి కలవాడనీ అభిప్రాయం ఉండడంతో, పెద్దిరెడ్డికి అప్పుఇవ్వడానికి అనుమతి ఇచ్చేసాడు శైలేంద్ర.

★★★★★

మరసటి రోజే, ట్రైనింగ్ ప్రోగ్రామ్ దేనికో హాజరవడానికి పుణే వెళ్ళిపోయాడు. రెండువారాల తరవాత తిరిగి వచ్చాడు. ఇన్ని రోజులూ చావడానికి సిద్దంగాఉన్న పెద్దిరెడ్డి తోట అప్పుడప్పుడూ కళ్ళముందు కదులుతూనే ఉంది శైలేంద్రకి. ఆఫీసుకు వచ్చిన వెంటనే స్వామిని పిలిచాడు తన గదిలోకి.

"పెద్దిరెడ్డికి లోను శేంక్షన్ చేసేరా స్వామీ? బోరు వేసాడా? నీళ్ళు పడ్డాయా" ప్రశ్నల వర్షం కురిపించాడు ఆత్రంగా. స్వామి మొహంలో మారిన ముఖకవళికలు చూసిన శైలేంద్ర మనసేదో అశుభాన్ని శంకించింది. 'నీళ్ళు పడ్డాయా' అని రెట్టించాడు.

"లేదు సార్. చుక్కనీరు కూడా పడలేదు" చెప్పేడు స్వామి నెమ్మదిగా.

" భయపడినంతా అయ్యిందన్నమాట. పెద్దిరెడ్డి ఎలా ఉన్నాడు?" ప్రశ్నించాడు ఆందోళనగా.

"బోరువేసిన రాత్రే ఉరేసుకుని చనిపోయాడు సర్. కొడుక్కి రాసి పెట్టిన ఉత్తరంలో 'భూమి అమ్మేసైనా సరే, అప్పు తీర్చేస్తానని మేనేజరుగారికి మాటిచ్చాను. ఎలాగైనా నామాట నిలబెట్టమని' రాసాడట సార్" చెప్పేడు స్వామి బాధగా.

లోతుకుపోయిన కళ్ళతో జాలిగా, దీనంగా చూస్తున్న పెద్దిరెడ్డి మొహం శైలేంద్ర కళ్ళముందు కదలాడింది. హృదయాన్నేదో పైశాచికహస్తం బలంగా మెలి తిప్పి వదిలిపెట్టినంత బాధ కలిగింది. అనవసరంగా అప్పు ఇచ్చి పెద్దిరెడ్డిని చంపేసానేమో అన్న అపరాధభావం మరింత వేదన కలిగించింది. తనను తను సంభాళించుకునే ప్రయత్నంలో కళ్ళు రెండూ గట్టిగా మూసుకున్నాడు. చాలా సేపటికిగాని తేరుకోలేకపోయాడు. తేరుకున్నాక...

జేబులోనుంచి రుమాలు తీసి మొహం తుడుచుకుంటూ "గుండె మండిపోతోంది స్వామీ, కాని, కళ్ళనుండి ఒక్కటంటే ఒక్క చుక్కైనా రాలట్లేదు చూడండి!!! మీ సీమలో తాగడానికే అనుకున్నాను, కన్నీటికి కూడా కరువేలా ఉంది" అన్నాడు బాధాతప్త హృదయంతో!!!

COMMENTS